## క్లుప్తంగా

### మొక్కజొన్న పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

**కేశంపేట:** పంటలో వచ్చిన కలుపును తొలగించుకునేందుకు మండల పరిధిలోని లేమామిడి గ్రామానికి చెందిన రైతు శ్రీధర్‌రెడ్డి కేశంపేట గ్రామంలోని గ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణంలో అక్కడి సిబ్బంది సూచనలతో అట్రిజన్ స్ప్రే మందును కొనుగోలు చేశాడు. వారు సూచించిన విధంగా మందును స్ప్రే చేయడంతో మొక్కజొన్న పంట ఎండిపోయింది. దీంతో రైతు వ్యవసాయ అధికారులకు, గ్రోమోర్ కేంద్రంలో ఫిర్యాదు చేశాడు. ఇదే విషయమై సోమవారం మొక్కజొన్న పంటను మహబూబ్‌నగర్ నుంచి ప్రిన్సిపాల్ సైంటిస్టు డాక్టర్ భారత్ భూషన్, డాక్టర్ శైలజ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శిరీష, రైతులు పాండురంగారెడ్డి తదితరులు ఉన్నారు.

### చదువుతోనే ఉజ్వల భవిష్యత్

బీఆర్‌ఎస్ నాయకుడు సత్యనారాయణ



యూనిఫామ్ అందిస్తున్న బీఆర్‌ఎస్ నేత సత్యనారాయణ

**కొత్తూరు:** చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఎమ్మె సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో గల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు ఆయన సోమవారం తన సొంత ఖర్చులతో యూనిఫామ్, క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి వ్యాపారులు, రాజకీయ నాయకులు, యువత స్వచ్ఛందంగా తోడ్పాటునందించాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సులువుగా పాఠాలు అర్థమయ్యే రీతిలో బోధించాలని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ఓ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు బీఆర్‌ఎస్ నేతకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు బాల్‌రాజు, రమేశ్, భీమయ్య, దామోదర్‌రెడ్డి, జైపాల్, జగన్, సత్తయ్య, రాజు, హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### 'రాజీవ్ యువ వికాసం'ను సద్వినియోగం చేసుకోవాలి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీశ్

**మొయినాబాద్‌రూరల్:** రాజీవ్ యువ వికాసం పథకానికి నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకొని స్వయం ఉపాధి పొందాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ అన్నారు. సోమవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో పెట్టిన అంశాలను దశల వారీగా అమలు చేస్తుందన్నారు. అందులో భాగంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారన్నారు. ఇందుకుగాను నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కోసం రూ.1 నుంచి 3 లక్షల వరకు రుణాలు అందించనున్నారని పేర్కొన్నారు. వెబ్‌సైట్ tgobmms.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం 60 నుంచి 80 శాతం వరకు రాయితీ కల్పిస్తుందన్నారు. దరఖాస్తులను ఏప్రిల్ 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఆయా పార్టీలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని సూచించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు శ్రీరామరక్షగా ఉన్నాయని తెలిపారు. విమర్శలు మాని ఆయా పార్టీలు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

# సమస్యల వేదిక!

- రైతువేదికల్లో కనీస సౌకర్యాలు కరువు
- నిర్వహణకు నిధులు రాక పేరుకుంటున్న బిల్లులు
- ఇబ్బంది పడుతున్న రైతులు, అధికారులు



తిమ్మాపూర్‌లోని రైతువేదిక

**కొత్తూరు:** గ్రామాల్లో రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటూ వ్యవసాయ అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు గత ప్రభుత్వం రైతు వేదికల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. రైతులు, అధికారులకు ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలతో నిర్మించగా.. ప్రస్తుతం వాటి నిర్వహణకు నిధులు రాకపోవడంతో రైతు వేదికల్లో సమస్యలు ఏకరువుపెడుతున్నాయి. దీంతో పలు సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌ల నిర్వహణకు వచ్చే రైతులు, నిత్యం విధులు నిర్వహించే అధికారులు సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ రెండేళ్ల నుంచి నిధులు రావడం లేదు. దీంతో విద్యుత్ బిల్లులు, ఇతర నిర్వహణ భారంగా మారుతోంది.

### అందని నిధులు..

ప్రభుత్వం మండలాల వారీగా రైతుల సౌకర్యార్థం ఐదు వేల ఎకరాల వ్యవసాయ పొలానికి ఒకటి చొప్పున రెండు క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఇందులో సమీప గ్రామాల రైతులకు అనుకూలంగా ఉండే విధంగా ఇన్ముల్‌నర్వ, తిమ్మాపూర్ గ్రామాల్లో రైతు వేదికల నిర్మాణాలను చేపట్టారు. మండలంలో సుమారు 7 వేల 600 ఎకరాల వ్యవసాయ భూమి, రైతులు 9617 మంది రైతులు ఉన్నారు. కానీ ప్రభుత్వం రైతు వేదికలకు నిధులు ఇవ్వకపోవడంతో ఏఈఓలకు నిర్వహణ భారంగా మారింది. కనీసం నీటి వసతి లేదు. మరుగుదొడ్ల నిర్వహణ లేకపోవడంతో సమావేశాలకు వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ బిల్లులు సైతం పేరుకుపోయాయి.

### నెలకొన్న సమస్యలు..

- కొత్తూరు, ఇన్ముల్‌నర్వ రైతువేదికలకు ప్రహరీలు నిర్మించలేదు.
- రెండు వేదికలకు వెలుతురు రావడానికి వీలుగా గ్రిల్స్ ఏర్పాటు చేశారు. కానీ వాటికి కిటికీలు ఏర్పాటు చేయలేదు. దీంతో వర్షపునీరు, దుమ్ము విపరీతంగా చేరుతోంది.
- వేదికల సమీపంలో టాయిలెట్స్ నిర్మించినప్పటికీ నీటి వసతి కల్పించలేదు. సమావేశాల సమయంలో రైతు వేదికలకు వచ్చే రైతులు, అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు.



కిటికీలు లేకపోవడంతో చెత్తగా మారుతున్న తిమ్మాపూర్‌లోని రైతువేదిక

### నిర్వహణకు నిధులు లేవు



గతంలో రైతు వేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రెండేళ్లుగా నిధులు రావడం లేదు. ప్రస్తుతం రెండు రైతు వేదికల విద్యుత్ బిల్లులు సుమారు రూ.30వేల వరకు బకాయి ఉంది.

– గోపాల్, మండల వ్యవసాయాధికారి

# వర్గీకరణ జరిగేవరకు నియామకాలు చేపట్టొద్దు



మొయినాబాద్: ఎమ్మార్పీఎస్ నాయకులకు సంఘీభావం తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్‌రావుమాదిగ

**మొయినాబాద్:** ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరిగేవరకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టొద్దని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ క్యాసారం శంకర్‌రావుమాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి ఏడోరోజుకు చేరుకున్నాయి. మేడిపల్లి మాజీసర్పంచ్ నవీన్, చిలుకూరు, కుత్బుద్దీన్‌గూడకు చెందిన నాయకులు ఆంద్రూ, ఈశ్వర్ తదితరులు దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శంకర్‌రావుమాదిగ మాట్లాడుతూ.. గతేడాది ఆగస్టులో ఏబీసీడీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని, ఆ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో వర్గీకరణ అమలుచేస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండానే ఉద్యోగ నియామకాలు చేపడుతూ ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌మాదిగ, ఉపాధ్యక్షుడు రాజుమాదిగ, నాయకులు భాస్కర్‌మాదిగ, భిక్షపతి మాదిగ, కృష్ణమాదిగ, దిలీప్‌కుమార్‌మాదిగ, కుమార్‌మాదిగ, నగేశ్‌మాదిగ, రవిమాదిగ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

### వర్గీకరణతోనే మాదిగల బతుకుల్లో వెలుగులు

**చేవెళ్ల:** ఎస్సీ వర్గీకరణ అమలులోకి వస్తేనే మాదిగల బతుకుల్లో వెలుగులు నిండుతాయని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి బి.శివశంకర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాను ప్రసాద్‌మాదిగ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో వారు పాల్గొని మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ మాదిగల 70 ఏళ్ల ఆకాంక్ష అని, అన్ని రంగాల్లో ఇన్నాళ్లు మాదిగలు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధించటమే లక్ష్యంగా మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని ఉద్యోగ నోటిఫికేషన్‌లకు ఎస్సీ వర్గీకరణను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ చట్టాన్ని అసెంబ్లీలో బిల్లు ఆమోదించి తక్షణమే అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంతవరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. ఈ దీక్షలో ఘనపురం అధ్యక్షుడు ఇదుపల్లి రాములు, మల్కాపూరం శాంతికుమార్, గుండాల మల్లేశ్, గొల్లపల్లి వెంకటేశ్, అల్లవాడ విజయ్‌కుమార్, ఎన్కేపల్లి ప్రసాద్, నాయకులు తదితరులు ఉన్నారు.

### మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి, ముస్లింలు

**షాబాద్:** మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దర్గాలో మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దండు రాహుల్‌గుప్తా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ఐకమత్యానికి, మత సామరస్యానికి చిహ్నంగా నిలుస్తాయన్నారు. సర్వమత సారం ఒక్కటేనని, మానవులంతా సోదరభావంతో ఉండాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. మైనార్టీలకు అండగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి పథకాలు ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అక్తర్‌పాషా, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్‌లు జనార్ధన్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, రవీందర్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, లింగం, నాయకులు రాఘవేందర్, శేఖర్, ప్రభాకర్‌రెడ్డి, అన్వర్, ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు

టీపీసీసీ కార్యదర్శి ఎస్.రాంరెడ్డి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

**షాబాద్:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని టీపీసీసీ కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు సూర్యగౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో రూ.5లక్షల నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గ్రామాల్లో అర్హులైన వారందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. పార్టీ కార్యకర్తలందరూ ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు కలిసి పనిచేస్తేనే విజయ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో నాయకులు చేగూరి యాదయ్య, మాణిక్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, రాజేందర్, లక్ష్మయ్య ఉన్నారు.

# గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి

**షాద్‌నగర్:** గ్రామాల అభివృద్ధికి కేంద్రం పూర్తిగా కట్టుబడి ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని, అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పల్లెల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం కనీస మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. రాష్ట్రాన్ని పదేళ్ల పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించకుండా అనేక ఇబ్బందులను గురి చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లా నర్సింలు, కట్టా వెంకటేశ్, ఆంజనేయులు, గోవర్ధన్‌రెడ్డి, మల్లేశ్, కృష్ణయ్య, సురేందర్, శ్రీను, మల్లేశ్, శ్రీనివాస్, శివశంకర్‌రెడ్డి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# తాగునీరు వృథా..

**మొయినాబాద్‌రూరల్:** మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంకుకు ఆన్, ఆఫ్ నల్లాలు లేక నీరు వృథాగా పోతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో కొన్నిరోజుల నుంచి నీరు వృథాగానే పోతోందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ పాఠశాల ఎదుట గల మంచినీటి ట్యాంకును చుట్టూ పక్కల ప్రజలు ఉపయోగించుకుంటారు. ఈ ట్యాంకుకు ఆన్, ఆఫ్ నల్లాలు లేకపోవడంతో నిరంతరం నల్లాల ద్వారా నీరు వృథా అవుతోంది. ఇకనైనా అధికారులు ఈ ట్యాంకుకు ఆన్, ఆఫ్ నల్లాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని కాలనీవాసులు పేర్కొంటున్నారు.



ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీరు

# కులగణన చరిత్రాత్మక విజయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్:** కులగణన చరిత్రాత్మక విజయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. కులగణన చారిత్రాత్మక విజయం అని, దేశానికి తెలంగాణ మోడల్‌గా కులగణన నిలుస్తుందన్నారు. బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం హర్షణీయమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఎన్నో మార్పులు వచ్చాయని, కానీ బీసీలకు సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా జరుగుతున్న అన్యాయాలను గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డి 40శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. సమాజంలో ఉన్న అసమానతలను తొలగించేందుకు పార్టీ అధినేత రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు రాష్ట్రంలో కులగణన చేసి చట్టం చేస్తుండటం హర్షణీయమన్నారు. అన్ని పార్టీలు బీసీలకు అన్యాయం చేశాయని, కాంగ్రెస్ సర్కార్ బీసీల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించిందన్నారు. నాయకులు బానిసలుగా బతుకొద్దని, అన్ని పార్టీల్లో ఉన్న బీసీ నాయకులందరూ కలిసికట్టుగా ఉండి బీసీబిల్లుకు చట్టబద్ధత సాధించుకునేందుకు సీఎంకు సహకరించాలని కోరారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

**షాద్‌నగర్:** ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన శాసన మండలి సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించాలని ఎంతో కాలంగా ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారని, వారి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఉద్యోగులు డీఏ అడగొద్దని సీఎం చెప్పడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. అదేవిధంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల్లో 317 ఓజీ అంశం కూడా ఉందని, ప్రభుత్వం ఈ జీఓను ఎత్తివేస్తారా లేదా అనే దానిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణమస్తు పథకం కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, దీంతో పేదలు బంగారం వస్తుందని ఎంతో ఆశపడ్డారన్నారు. కానీ ప్రభుత్వం ఇచ్చిన హామీని ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. ఈ విషయాన్ని సభలో ప్రస్తావిస్తే మంత్రి కల్యాణమస్తుకు తులం బంగారం ఇవ్వలేమని చెప్పడం సరికాదన్నారు.

# ఆ వ్యక్తిపై చర్య తీసుకోవాలి

**శంకర్‌పల్లి:** ఎలాంటి అనుమతి లేకుండా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం మోకిల పంచాయతీ సెక్రటరీ ఎల్లయ్య మోకిల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ, గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ తన 2 ఎకరాల పొలంలోకి మురుగునీరు వస్తోందని గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేశాడని తెలిపారు. అధికారులు విచారణ చేస్తామని చెప్పినప్పటికీ వినకుండా ప్రధాన రహదారి పక్కన మురుగునీరు ప్రవహించే కల్వర్టులో మొరం నింపాడని, దీంతో గ్రామం నుంచి వెళ్లాల్సిన మురుగునీటి సరఫరా ఆగిపోయిందని పేర్కొన్నారు. సమస్యను పరిష్కరిస్తామని చెప్పినప్పటికీ, అనుమతి లేకుండా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశాడని వినోద్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.



ప్రధాన రహదారి పక్కన కల్వర్టులో మొరం పోయిస్తున్న గ్రామస్తుడు

# కొలతలు లేకుండా డబ్బులు ఇవ్వాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న జంగయ్య

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య

**షాద్‌నగర్:** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా డబ్బులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశానికి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెళ్లి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం రోజుకు రూ.700ల చొప్పున కూలీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. రెక్కాడితే కాని డొక్కాడని ఉపాధి కూలీలకు పనికి సరిపడా కూలీల డబ్బులు చెల్లించడం లేదన్నారు. అదేవిధంగా వేసవి కాలం ప్రారంభం కావడంతో ఎండలు మండుతున్నాయని, పని ప్రదేశాల్లో కూలీలకు ప్రభుత్వం కనీస సౌకర్యాలను కూడా కల్పించడం లేదని ఆరోపించారు. దీంతో కూలీలు ఎండలో పని చేస్తున్నారని, పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. అదేవిధంగా మట్టి పనులు నిర్వహించే కూలీలందరికీ ప్రభుత్వం బీమా సదుపాయం కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు తాము అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, కృష్ణ, గ్రామ కార్యదర్శి జంగయ్య, టెక్నికల్ అసిస్టెంట్ సత్తయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో మేలు

గ్రీన్‌ఫీల్డ్ ఫౌండేషన్ ఫౌండర్ నాగరాజు

**షాద్‌నగర్:** ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని, వాతావరణ పరిస్థితులు, విపత్తులను తట్టుకునే సామర్థ్యం ఉండటంతో రైతులకు లాభదాయకంగా ఉంటుందని గ్రీన్ ఫీల్డ్ ఫౌండేషన్ ఫౌండర్ నాగరాజు అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రీన్ ఫీల్డ్ ఫౌండేషన్ సంస్థ సభ్యులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి మేలు చేయడంతో పాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందన్నారు. వరి చేలల్లో రసాయన ఎరువుల వాడకంతో రానున్న భవిష్యత్ తరాలు ప్రశ్నార్థకంగా మారుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా భూమి సారవంతంగా మారడమే కాకుండా మంచి ఫలితాలు వస్తాయన్నారు. స్థానికంగా ఉండే ఆకులు, ఆవు పంచకం, పేడ, కొన్ని రకాలైన పప్పుల పొడులతో అనేక రకాలైన ఎరువులు, క్రిమిసంహారక మందులు తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వడ్ల రమేశ్‌చారి, పంచాయతీ కార్యదర్శి సరోజ, రైతులు పవన్‌కుమార్, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

# కుర్మిద్దలో సీపీఎం బృందం పర్యటన

**యాచారం:** మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో సోమవారం సీపీఎం బృందం పర్యటించింది. గ్రామంలోని పలు కాలనీల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య, రేషన్‌కార్డులు, కొత్త పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం లేదని ప్రజలు ఫిర్యాదులు చేశారు. ప్రజల ఫిర్యాదులపై గ్రామ పంచాయతీ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.అంజయ్య, నాయకులు పి.పాల్, గోవర్ధన్, సంజీవ, అంజయ్య, రమేశ్, మల్లేశ్, విజయకుమార్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.